పతీతసి

పెద్దిభొట్ల సుబ్బరామయ్య

"ఇదుగో మాట ఒక్కసారిట్టా ఒచ్చి పో_"

పిలుపు విని ఒక్కసారి పక్కకు తిరిగి చూసి అంతలోనే తల తిప్పుకుని నడిచి పోయాడు ఆ వ్యక్తి.

ఉదయం....తొమ్మిది గంటలవేళ.... ఎండ చిటపటలాడుతున్నది. తెల్లవారు తూనే సూర్యుడు కోటి కోట్ల పదునైన కతులు తిప్పుతూ ఉదయించాడు పొద్దెక్కే కొద్దీ ఎండలో వేడీ వాడీ ఎక్కువై భరించ శక్యం కాకుండా ఉంది. నిరంకుశుడైన పరిపాలకుడిలా సూర్యుడు ధుమధుమ లాడుతూ ఈ సమస్త ప్రపంచాన్నీ రోస్ట్ చేసేస్తున్నాడు. ఆకాశంలో ఎక్కడా మబ్బు తునకలేదు. గాలి అలిగి బిగించుకుకూచుంది.

"అబ్బబ్బ! ఈ ఎండలేమిటో ఎన్నడూ ఎరగం....తపన పుడుతున్నది..." అన్నది సావిత్రి.

'ఇట్టాటి ఎండలు చాలా చూశాన్లేను.' అని వూరుకుంది పక్కగుడిసె గుమ్మంలో నిలబడివున్న వరాలు

అంతలో మళ్ళీ ఎవరో వీధిన పోతూ వుంటే "ఇదుగో మాట. ఒక్కసారిట్టా వొచ్చిపో...." అని పిలిచారిద్దరూ.

ఆ మనిషి రాలేదు తనను కాదన్నట్టుగా ఎటో చూస్తూ వెళ్ళిపోయాడు. సావిత్రి నిట్టూర్చింది. పొద్దుటినుంచీ ఇన్ని టీ నీళ్ళయినా తాగలేదు ఆకలి....పొట్టలో ఏదో చిచ్చు పెట్టినట్టుగా మంట...."ఒక్క బేరం తగిలితే బాగుండిపోను. లేకపోతే నీరసం వొచ్చేసి పడిపోవడం ఖాయం...." అనుకుంది.

ఎదురుగా బ్రహ్మాండమైన సినిమాహాలు. బాల్కనీ మీద ఆదివారం ఉదయం ఆటకు వచ్చినవారు కొందరు చల్లగా గోల్డ్‌స్పాట్‌లూ కోకాకోలాలూ తాగుతూ నిలబడి వున్నారు.

సావిత్రి పెదవులు తడుపుకుంది. ఈ దాహం. ఆకలితో ఇవాళ చచ్చిపోవడం తప్పదలేవుంది. గుడిసె వాకిట నిలబడి ఇప్పటికి గంట సేపటి నుంచీ కనిపించిన వాడినల్లా పిలుస్తున్నది.

ఈ వరాలు దగ్గర రాత్రి బిజినెస్ తాలూకు కొంచెం సొమ్ము మిగిలివుంటుంది పొద్దున్నే రెండిడ్లీలు తెప్పించుకు తిని టీ తాగి యిప్పుడే వచ్చింది గుమ్మంలోకి. కాస్త ముస్తాబయింది కూడా. పలుచని ఎర్ర చీర కట్టి తెల్ల జాకెటు తొడుక్కుంది రాత్రి అద్దే పెట్టిన కాసిని పూలు తల్లో పెట్టుకున్నది. కాస్త నిద్రకూడా పోయి నట్టుంది. తనకు నిద్రలేదు. తెల్లవారు జామున ఎప్పుడో కాస్త నిద్రపట్టిందిగాని. అదేం నిద్ర? అన్నీ కలలే. రెండుసారు కలల్లో అమ్మ కనిపించింది. ఒకదాన్లో ఆమె చెమటలు కక్కుతూ పిండిరుబ్బుతూ కనిపించింది. రెండోదాన్లో ఎందుకో కళ్ళ నీళ్లు పెట్టుకుని కనిపించింది. ఏదో అంటున్నదిగాని తనకు తెలియలేదు అంతలోనే కాకిరూపం ధరించి ఎగిరిపోయింది.

సావిత్రి ఉలిక్కిపడింది.

"ఏమే! నాబాకి ఎప్పుడు తీరుస్తావ్?" అని అడుగుతూ నిలబడి వున్నాడు అప్పారావు. అతను తెల్లని పంచె కట్టుకుని వున్నాడు. పలుచని లాల్చీ తొడుక్కుని వున్నాడు. మెడలో సన్నని బంగారు గొలుసుంది. నల్లని చేతివేళ్ళకు ఒకటో రెండో ఉంగరాలున్నాయి. లోపలికివచ్చే ధోరణిలో మాత్రం లేదు.

సావిత్రికి కళ్ళనీళ్ళు వచ్చాయి. బొంగురు గొంతుతో "ఇస్తానిస్తాను" అన్నది.

"ఆఁ! ఇస్తావు. ఎన్నాళ్ళయింది తీసుకుని? రెణ్ణెలు దాటింది ఏమని చెప్పి తీసుకున్నావు? 'నాలుగు రోజుల్లో ఇస్తా'నని తీసుకున్నావు."

అప్పారావు ఇంకా ఏదో అనబోయాడు గాని ఎందుకో ఏమీ అనకుండా విసవిస నడిచి వెళ్ళిపోయాడు.

సావిత్రి నిట్టూర్చింది. "ఇంకా నయం ఇప్పుడు లోపలికిపోదాం రమ్మన లేదు. అసలే నీరసంతో చస్తుంటే" అనుకున్నది

వరాలు "ఏవఁమ్మా! ఇంకా వీడి బాకీ తీరలేదా?" అని అడిగింది.

సావిత్రి తల అడ్డంగా వూపింది.

మళ్ళీ "ఎప్పటి కర్ఫ్యూ రోజులు! ఏనాటి సంగతి? ఆ పది రూపాయలబాకీ యింకా తీరలేదా? ఈ రెణ్ణెల్లలో ఎన్నిసార్లొచ్చి ఉండిపోయాడు నీతో? నేనే ఎ పది సార్లో చూసివుంటాను. అదంతా ఆ పది రూపాయలకీ వడ్డీకింద లెక్కా?' అని అడిగింది.

"ఏమో మరి! అంతేనేమో," అన్నది సావిత్రి.

స్వప్న చక్షువు
చిత్రం : జయశ్రీ, సికింద్రాబాద్

ఆ రోజులు.... ఎంత భయంకరమైన రోజులు వరసగా రోజుల తరబడి ఊళ్ళో కర్ఫ్యూ పెట్టారు. మనిషన్నవాడు బయట కనిపించ కూడదన్నారు కనిపిస్తే నిర్దాక్షిణ్యంగా చావగొట్టారు కాకి దుస్తులవారితో చేతుల్లో తుపాకీలు లాఠీలు ధరించినవారితో నిండిన లారీలు రివ్వురివ్వున వీధుల్లో తిరిగాయి. సాయంకాలం ఆరు గంటలకే వాళ్ళ పాలన మొదలు. బతికున్న వాడెవడూ బయట తిరిగేందుకు వీలేదు....

ఆ రోజుల్లో చేతిలో పైసాలేక తిండికి లేక కడుపు మాడి ఈ అప్పారావు దగ్గర సావిత్రి పది రూపాయలు అప్పు తీసుకున్నది. ఆ నాడు అప్పారావు పది రూపాయలయితే ఇచ్చాడు కాని "పొద్దుపోయింది కదా! కర్ఫ్యూ... ఇంటి కెళ్ళేందుకు కుదరదు మరి....ఉండిపోతా..." అని తన గుడిసె లోనే రాత్రల్లా వుండిపోయాడు. ఆ తెల్లవార్లూ అతడు నిద్రపోలేదు. తననూ నిద్రపోనివ్వలేదు. దయ్యం పట్టినవాడిలాగు ప్రవర్తించాడు. అయినా తాను సహించింది. ఎందుకు? పది రూపాయలు అప్పు ఇచ్చాడు మరి!

సావిత్రి గుడిసె లోపలికి వచ్చింది. కాళ్ళు పీక్కుపోతున్నాయి. కాస్సేపు కూర్చుంటే బాగుండు ననిపించి తడికెకు ఆనుకుని కూర్చుండిపోయింది. ఎదురుగా మట్టిగోడమీద పాత సర్టిఫికెట్ వ్రేలాడుతున్నది. దాని ఫ్రేము పాతబడిపోయింది అద్దం ఒకపక్క కొంచెం పగిలింది లోపల తెల్లని కాగితం కొంతమేరఎప్పుడో వానకు తడిసి బ్రవును రంగులోకి మారింది. ఏవేవో చిన్న పురుగులు కొట్టివేయడం వల్ల కాయితం చాలాభాగం చిల్లులుపడి తన జీవితంలాగే వుంది. అక్షరాలు కూడా అలుక్కుపోయి వున్నాయి పక్కనే అటునుంచి యిటు కట్టిన తాటిమీద తన మరొక చీరె వ్రేలాడుతున్నది. అది మొన్నరాత్రి పూర్తిగా పాడయిపోయింది. ఇవాళ ఏదో ఒక సమయంలో పక్కనేఉన్న కాలవకు వెళ్ళి అందులోఉన్న కాసిని నీళ్ళలో ఉతుక్కుని తెచ్చుకోవాలి. రాత్రికది ఆరుతుందా? ఎందుకారదు? ఈ ఎండకూ వేడిగాలికీ క్షణంలో ఆరిపోతుంది. ఫరవా లేదు.

సావిత్రి అలాగే చాలాసేపు తలమీద చెయ్యిపెట్టుకుని కూర్చుండిపోయింది. అంతలో అమ్మ గుర్తువచ్చింది. పద్నాలుగేళ్ళ దాకా తనను కళ్ళలో పెట్టుకుని పెంచిన అమ్మ! తనకోసం ఎన్నియిళ్లల్లో చాకిరీ చేసింది! ఎంత కష్టపడింది! అంత నీరసంలోనూ తాను పేలికలైన చీరెలే కట్టుకున్నదో, చిరిగిన జాకెటే తొడుక్కున్నదో, తిన్నదో లేక పస్తులున్నదో

చీకటి

ఏమీ తెలీదు. కండరాలు కరిగించి పనిచేసి పైనా పైసా తనకోసం వెచ్చించింది. ఆరోజున....తనకు జ్వరం. అమ్మవారు పోసింది. తాను కుక్కిమంచంలో వొళ్ళు తెలియక పడివుంటే అంత చాకిరీ చేసి వచ్చి తన పక్కన కూర్చుని "అమ్మాయ్! ఇవాళ మీ బళ్ళో సభ జరుగుతుంది కదుటే. నీకు బహుమతి యిస్తారంటివిగా! నీ బదులు నేను వెళ్ళి తీసుకొచ్చేదా?" అని అడిగింది. తానప్పుడేం చెప్పిందో గుర్తులేదు. పిచ్చి మనిషి! ఉరుకులు పరుగులుగా బడికి వెళ్ళి ప్రయిజులిస్తున్నప్పుడు తన పేరు రాగానే పమిట సరిచేసుకుని స్టేజీమీదకి వెళ్ళిందట. జనమంతా ఘొల్లుమన్నారు. స్టేజిమీద ఉన్న పెద్దలు "నువ్వెవరు? దిగు ముందు. కిందికి పో." అని గదమాయించారుట. "మా అమ్మాయేనండి సావిత్రి. నా కూతురు. దానికి జ్వరం.... నాకివ్వండి తీసుకుపోతాను" అంటుంటే వినిపించుకోకుండా కిందికిదింపి తరిమేశారు అంత అవమానంపొంది తిరిగి వచ్చి "నువ్వు నా కూతురివేకదా? నీకు జరం కదా? అందుకని నేనేవెళ్లాను. నేనేం తప్పు చేశాను?" అని ఆ రోజల్లా ఎంతో బాధపడిపోయింది. అలాటి అమ్మ! పిచ్చితల్లి పనిచేసిచేసి శక్తి అంతా ఖర్చు పెట్టేసుకొని చచ్చిపోయింది. కూతుర్ని గురించిన దిగులుతో నిండిన ఆ కళ్ళలోనుంచే ప్రాణాలు పోయాయి.

బయట ఏదో గొడవ.

సావిత్రి లేచి యివతలికి వచ్చింది. ఎదురుగా లాటరీ టిక్కెట్లబండి వెళ్తున్నది మైకులో ఒకడు "మైసూరు లాటరీ.... ఇవాళే డ్రా.... టిక్కెట్టు రూపాయి మాత్రమే. త్వరపడండి....కొద్ది టిక్కెట్లు మాత్రమే ఉన్నాయి...లక్షలు లక్షలు.... ఆ అదృష్టవంతులు మీరే కావచ్చు.... ఫల్ ఫల్ ఫల్‌మని ఆ మహాలక్ష్మి తల్లి మీ ఇంటికే....మీ ఇంటికే రావచ్చు....' అంటున్నాడు.

వరాలు "ఇదుగో అబ్బా! బండాపుకుని ఒకసారిట్టా వొచ్చిపో" అని పిలిచింది.

అతడు నవ్వి "టిక్కెట్టు కొంటావా? రూపాయేగా? లక్షలొస్తాయి మైసూర్ గవర్మెంటు లాటరీ...." అన్నాడు.

"కొంటా నేరా" అన్నది వరాలు.

అతడు టిక్కెట్లు చేతిలో పుచ్చుకుని రాగానే "గవర్మెంటోళ్ల లాటరీయా? ఏ గవర్మెంటు?" అని అడిగింది.

"మన్దే మైసూరు గవర్మెంటు..."

"మైసూర్ గవర్మెంటు మన గవర్నమెంటెలాగవుద్ది?"

"అది అంతేలే...."

"ఏమిటంతే? అసలు మన్దేగవర్మెంటో చెప్పు....ఆంధ్రాయేగా?"

"అవును"

"మరి మైసూరు గవర్మెంటు మనదంటావేం?"

"అదంతేలే. అసలింతకీ టిక్కెట్టు కావాలా వొద్దా తేల్చు...లక్షలొస్తుంటే..."

"నువ్వు ముందు సంగతి తేల్చు.... తర్వాత కొంటాను." అంటూ వరాలు సావిత్రివంక చూసింది. సావిత్రి మాట్లాడ లేదు.

పక్కన చిన్నపందిట్లో కూర్చుని నిరంతరం బీడీలు కాలుస్తుండే గురువులు- అతడికి అరబ్బీ గుర్రాల్లాగా ఎదిగిన కూతుళ్ళిద్దరున్నారు రోజూ రిక్షాలో లాడ్జింగులకుపోయి సంపాయించుకొస్తారు- నవ్వుతూ లేచివచ్చి వరాలుతో "పిచ్చి మాలోకమా! అంతా యిన్నాను. అతన్చెప్పేదే కరెకు...మైసూరు కూడా మన్దేశంలోదే టిక్కెట్టుకొను. డ్రా ఇయ్యాళే అంటుండాడుగా. నీకే తగలొచ్చు లక్షలు...." అన్నాడు.

వరాలు ఒక్క క్షణం ఆలోచించి "సరే అయితే...మంచిదిగా చూసి ఒక టిక్కెట్టిచ్చిపో"... అన్నది. టిక్కెట్టు అందుకుని అటూయిటూ తిప్పిచూసి "ఇదింతేనా?" అని అడిగింది.

"అంతే. దానిమీద నెంబరుంటాది సూడు...ఆ నంబరు తెగితే చాలు...ఇది ఇచ్చేస్తే డబ్బిచ్చేస్తారు" అన్నాడు గురువులు మళ్ళీ.

వరాలు జాకెట్టు లోపలినుంచి చిన్న ఎర్రని ప్లాస్టిక్ పర్సుతీసి అందులోనుంచి రూపాయి కాయితం ఇవతలికి లాగి మడతలు విప్పి అతనికి అందించింది. అతడు దాన్ని అందుకుని రిక్షాఎక్కి మళ్ళీ అరుచుకుంటూ వెళ్ళిపోయాడు.

"అయిపోయింది. ఇంకచిల్లర డబ్బులు మిగిలాయి" అన్నది. వరాలు టిక్కెట్టు జాగ్రత్తగా మడిచి పర్సులో పెట్టుకుంటూ.

"నీ పని నయం. నా దగ్గర ఆ చిల్లర డబ్బులుకూడా లేవు...." అనుకుని నిట్టూర్చింది సావిత్రి.

గురువులు మళ్ళీ పందిట్లోకి వెళ్తూ "వరాలూ! రేపు పేపరుచూసి నే చెప్తాలే... ఛలేఛాన్స్ నీకు....లక్షలు కొట్టేస్తావు.... నీకొస్తే నాకందులో వాటా యిస్తావా?" అన్నాడు.

"అబ్బ ఆ! ఇస్తాను కాసుకూచో." అన్నది వరాలు. సూర్య కిరణాలు ఎర్రగా కాల్చిన పదునైన కత్తుల్లాగ వాడిగా వాతలు పెడుతున్నాయి. దోవన పొయ్యే వాళ్ళను నెమ్మదిగానే అయినా గొంతెండుకుపోయేటుగా పిలవడమే తప్ప ఫలితం కనిపించడంలేదు. చిటచిటలాడే ఎండ....ధారలుగా కారుతున్నచెమట....అలాంటప్పుడు ఎంత తిక్కవాడయినా, ఎంత పనికిమాలిన వాడయినా రాడుగాక రాడు.

ఈ ముసలి వాడెవరో తీపి మామిడికాయలమ్ముతూ పోతున్నాడు. సావిత్రి వాణ్ణి పిలిచింది.వాడు ఆమె ముందుకు వచ్చి తట్ట దించుకొని "ఎన్ని కావాలి?" అని అడిగాడు.

"ఒక్కటి చాలు. కాని డబ్బు లేవు. ఇప్పుడు కాయిచ్చిపోతే సాయంత్రం డబ్బు లిస్తా" అన్నది సావిత్రి కాయలవంక ఆశగా చూస్తూ.

ముసలివాడు గొణుక్కుంటూ బుట్ట తలకెత్తుకుని "మంచి బేరమే...." అంటూ వెళ్ళిపోయాడు. వరాలు అంతా చూస్తూ నిలబడింది తప్ప ఏమి మాట్లాడలేదు.

సావిత్రి అలాగే నిలబడి ఆపులించింది. తర్వాత చేతివేళ్ళు విరుచుకున్నది. బలహీనంగా వున్న ఒక కుక్కపిల్ల ఏమి తోచక రోడ్డు మధ్యగా నిలబడి వుంది వరాలు కూనిరాగం తీస్తూ మాటిమాటికీ పమిట తీసి విదిలించి మళ్ళీ వేసుకుంటున్నది. ఆమె మెడలో చవకరకం తెల్లని పూసల గొలుసున్నది.

పరిసరాలన్నీ - గుడిసెలూ, పైన తాటాకు కప్పులూ, ఎదురుగా గడ్డివామి, చివరకు పక్కనే కాలవలోఉన్న కొంచెం నీళ్ళూ- అన్నీ వేడెక్కిపోతున్నాయి. చండమార్తాండుడు కహకహ నవ్వుతూ క్రూరంగా రెచ్చిపోతున్నాడు. భూమి అనే పెనాన్ని బాగా వేడెక్కించి సమస్త జీవరాసులనూ, వస్తు సముదాయాన్నీ కాల్చి వేస్తున్నాడు. కాలవలో నామమాత్రంగా ఎక్కడో కొద్దిగా నీళ్ళున్నాయి. ఎండకు అలిసిపోయిన కాకులు నీళ్ళలో నిలబడి

సెక్సు హాస్పిటల్

దురభ్యాసాలకు లోనై దాంపత్య సౌఖ్యం అనుభవించ లేనివారు వెంటనే సంప్రతించండి!

డా. A. పూర్ణచంద్రరావు

(సెక్సు స్పెషలిస్టు) N.D.F.N.F.U(CEYLON) R.A.M.P

గవర్నరుపేట, ఏలూరురోడ్, విజయవాడ-2.(A.P)

సెక్సు వ్యాధులకు ప్రత్యేక చికిత్సా నిలయం

మాటి మాటికీ తలలు ముంచి "కావుకావు" మని మొర పెట్టుకుంటున్నాయి. వరసగా ఒకదానిమీద ఒకటిగా పేర్చి వున్నట్టున్న చిన్న చిన్న పాకలూ, ఆ పాకలో మాటి మాటికీ నిట్టూరుస్తూ దీనంగా ఉండే జనమూ, నిర్మేఘమైన ఆకాశమూ. ఆ కాశంలో ఎగరలేక ఎగరలేక నీరసంగా ఎగురుతూ పోతున్న రెండో మూడో పక్షులు - అంతటా అన్నిటా అలసట.... మందకొడితనం.... ఆకలి...దాహం....

"బాగా పొద్దెక్కింది...." అనుకున్నది. సావిత్రి అనుకుని వరాలువంక చూసింది.

వరాలు గుండెలమీద చెయ్యి వేసుకుని నెమ్మదిగా "లాట్రీ ఈపాటికి తీసుంటారేమో! రూపాయి తగలేసి కొన్నాను. ఇయాళికి తిండికి జరిగిపోయేది.... లాట్రీ తగిల్తే భాగుణ్ణు దరిద్రం వొదిలిపోద్ది.... నాకేగనక డబ్బొస్తేనా! ఎల్లిపోతాను. ఎటో ఎల్లిపోతాను. ఎల్లిపోయి హాయిగా బతుకుతాను. అన్నట్టు టిక్కెట్టు మడిచి పెట్టాను. అట్టా మడవకూడదేమో .... లోపల పుస్తకంలో పెట్టొస్తాను" అన్నది.

నెమ్మదిగా ఈ మాటలని వరాలు లోపలికి వెళ్ళిపోయింది. లోపల నులక మంచం పక్కన (ఆ మంచం పాక ఆసామిది. దానికి వేరే అద్దె) ఉన్న పాత పెద్దబాలీక్ష తెరిచి ప్లాస్టిక్ పర్సులో ఉన్న టిక్కెట్టు యివతలికి తీసి మడతలు విప్పి సరిచేసి అందులోవుంచి మూసేసింది. దాని పైనఏదో బరువువుంచి మళ్ళీ ఇవతలకి వచ్చింది. వచ్చేముందు గుమ్మంలో ఒక్కక్షణం ఆగి పమిటతీసి గుండెలమీద గట్టిగా ఊసుకుని "అబ్బబ్బ! ఏం చెమట! ఏం చెమట! ప్రాణాలు పోతున్నాయ్" అనుకుంటూ వచ్చింది.

సావిత్రికి కళ్ళు తిరుగుతున్నాయి. నిలబడి నిలబడి కాళ్ళు బరువెక్కిపోతున్నాయి. "లోపలికి వెళ్ళి కాస్సేపు చాపమీద నడుం వాల్చి ఒక కునుకు తీస్తే బాగుండు" ననుకున్నది. అనుకున్నదేగాని వెంటనే వెళ్ళలేదు. ఏమో! ఏ తిక్కమనిషైనా అటు వస్తే బేరం తగలవచ్చు ... అయినా అది అత్యాశ లాగున్నది. ఈ పూట అన్నప్రాప్తి వున్నట్టు లేదు. సరే ఇది మొదటిసారి గనుకనా! ఎన్నిసార్లు ఇలా కూడులేక మంచినీళ్ళతో పొట్ట నింపుకుని పడుకోలేదు.

మనిషి యిన్ని కనిపెట్టాడు. ఆకాశంలో ఎగురుతున్నాడు. నీళ్ళలో ప్రయాణం చేస్తున్నాడు దూరంగా ఎక్కడో ఉన్న వాళ్ళను చూస్తున్నాడు. దూరంగా ఉన్నవారితో మాటాడుతున్నాడు. ఇతర గ్రహాలకు ప్రయాణాలు చేస్తున్నాడు అయినా నిరంతరం ఆకలి వెయ్యకుండా ఒక్క మాత్రలాంటి దేదీ కనిపెట్టలేకపోయాడు. దేశంలో పండుతున్న పంట అంతా ఏమవుతున్నది? అచ్చేసిన రూపాయి కాయితాలన్నీ ఏ గంగలో కలుస్తున్నాయి? ఎందువల్ల కొందరి కవలు — ఆ మాటకొస్తే ఎక్కువ మందికి — అవి కనిపించకుండా పోతున్నాయి?

పక్కన "ప్రభుత్వ సారా దుకాణము"లో కూడా వ్యాపారం మందకొడిగా వుంది. గురువులుమాత్రం అక్కడ గుంజ కానుకుని కూర్చునివున్నాడు అతడుతున్నట్టుండి ఎదురుగా ఉన్నవానితో "ఒరే రాగవులూ! సోషలిజ మొస్తాదంట" అన్నాడు.

రాఘవులు పద్దుకు కూర్చుని "సోషలిజమా! అంటే ఏంటి గురువులూ!" అని అడిగాడు.

"సోషలిజమంటేనా! ఉండు చెప్తాను" అంటూ గురువులు బనీను జేబులోనుంచి బీడీతీసి వెలిగించుకుని అగ్గిపుల్లను జాగ్రత్తగా ఆర్పి అవతల పారేసి కాలితో రాచి "అసలే ఎండాకాలం జాగ్రత్తగా ఉండకపోతే అంతా బూడిదే...." అన్నాడు.

తర్వాత తీరికగా దమ్ముపీల్చి పొగ వొదిలాడు.

"సోషలిజమంటే ఏంటనికదా అడిగావు! అదిగో....ఆ మూడంతస్తుల మేడ చూడు. అందులో ముగ్గురే మనుషులుండారు. అవునా!"

"అవును" అన్నాడు రాఘవులు. "ఆళ్ళదేగా ఆ మేడ!"

"అవునుకదా! ముగురు మనుషులకంత పెద్దమేడ. అన్ని గదులూ ఎందుకు చెప్పు! అందులో ఏవన్నా మినింగుందా!"

"ఊఁ! అయితే ..."

"ఆ ముగ్గురికీ మూడు గదులు సాలు. ఆళ్ళకి మూడుగదులిచ్చేస్తారు."

"ఎవరిస్తారంటావు?"

"ఇంకెవరు? గవర్మెంటోళ్ళు."

"మేడంతా ఆళ్ళదేగదా, ఆళ్ళ గదులు ఆళ్ళకియ్యడమేంటి?"

"ఆళ్ళదీ లేదు. ఈళ్ళదీ లేదు. అంతా గవర్మెంటోళ్ళు తీసేసుకుంటారు ఆళ్ళను మూడు గదుల్లో సర్దుకోమంటారు."

"మిగిలిన గదులు?"

"మనాటోళ్ళ కిచ్చేస్తారు"

"బాగుందయ్యా! ఎప్పుడొస్తదది?"

"ఏంటి? సోషలిజమా?"

"ఆఁ! అదే"

"ఒచ్చేస్తా వుంది" అంటూ చిటికెలు వేశాడు గురువులు.

రాఘవులు కళ్ళు మెరిశాయి సావిత్రి ఈ సంభాషణ అంతా వింటూ బొమ్మలా నిలబడివుంది తర్వాత మళ్ళీ నిశ్శబ్దం.

సినిమా వొదిలారు హాలుముందునుంచి వెళ్ళేవాళ్ళు వెళ్ళగా కొందరు తక్కువ తరగతివాళ్ళూ, సైకిళ్ళవాళ్ళూ వెనకనుంచి వచ్చారు. వరాలు గొంతు పెద్దది చేసింది. సావిత్రి కూడా ఏమి తీసిపోలేదు. కాని పని ఏమి జరగలేదు. అయిదు నిమిషాల్లో అందరూ వెళ్ళిపోయారు. మళ్ళీ అంతా మామూలైపోయింది.

"ఇవాళ వరవేం బాగులేదు" అంటూ లోపలికి వెళ్ళింది వరాలు.

సావిత్రి కూడా ఇక నిలబడలేక లోపలికి వచ్చి చాపమీద నడుంవాల్చి ఉస్సురని నిట్టూర్చి కళ్ళు మూసుకున్నది. వేడిగాలి రివ్వున వీస్తూ వుంటే తడికె తలుపు తోసి కొంగు మొహానికి కప్పుకున్నది. ఏవేవో నల్లని గుండ్రని మచ్చలు కళ్ళల్లో కదులుతున్నాయి. సావిత్రికి అంతలో నిద్ర ముంచుకుని వచ్చింది.

• • •

ఎంతసేపు నిద్రపోయిందో తెలీదు. ఏదో పెద్ద రగడ...గొడవ....

ఉలిక్కిపడి లేచింది బయట ఏదో రణగొణధ్వని....కోలాహలం....చుట్టూ వేడి పొగలు....

వెంటనే తడికె తలుపు తోసి అరిచాడెవరో

"లోపల యెవరున్నారు!"

సావిత్రి కళ్ళు తెరవగానే ఎదురుగా తడికె చిల్లులలో నుంచి పొగలు వస్తున్నాయి. గభాలున లేచి తడబడుతూ ఇవతలికి వచ్చింది. గబ గబ రోడ్డుమీదికి పరుగెత్తింది.

వేడి వేడి.... అంతటా వేడి....

ఎదురుగా మంటలు — పాకలన్నీ తగలబడిపోతున్నాయి. సంధ్యవేళ నల్లని తెల్లని పొగల మధ్య ఎర్రని మంటలు.... అగ్నిదేవుడు తన ఎర్రని నాలుకలు చాపి సమస్తాన్నీ విచక్షణా రహితంగా మింగివేస్తున్నాడు జనం ఆబాల గోపాలమూ కట్టుబట్టలతో పరుగులెత్తుతూ శోకాలు పెడుతున్నారు. తలలు బాదుకుంటున్నారు. నుదుళ్ళు కొట్టుకుంటున్నారు. ఎదురుగా వెదుళ్ళు "తపతప"మని పేలుతూ కాలిపోతున్నాయి తాటాకులు "బుసబుస"మని కాలి ఎగురుతున్నాయి. జనంలో కోలాహలం ... కేకలు .... పరుగులు.... ఏడుపులు....

"అయ్యో! అయ్యో! ఇంకెలాగ బతుకుతాం?"

"ఇక సావే గతి"

"అంతా వచ్చేశారా?"

"బాచమ్మ లేమా? ముసిలి .... దానికి జరం ....వారం రోజుల్నించీ లేవలేకుండా పడుంది....అదికనిపించటం లేదుమరి...."

చీకటి

"సారా దుకాణం కూడా అంటుకుంది. ఇంక మంటలారవు. ఊరంతా భస్మమే .."

"నీళ్ళకార్లొచ్చేస్తున్నాయి."

"వొచ్చి వాళ్ళేం చేస్తారు? కాలవలో చుక్కయినా గంగలేదు."

అయ్యో దేవుడా ఏం గతి?"

పిల్లా మేకా, ముసలీ ముతకా, అంతా కట్టుబట్టలతో మసక చీకట్లో గుంపులు గుంపులుగా నిలబడిపోయారు.

సావిత్రికి గుండెలు దడదడ లాడుతున్నాయి. కాళ్లు వొణుకుతున్నాయి. కళ్ళు తేలిపోతున్నాయి. నాలుక పిడచ గట్టుకు పోతున్నది. చూస్తూ చూస్తూ ఉండగానే క్షణాలమీద తన ఇల్లు తన కళ్ళ ముందే పిడికెడు బూడిదయిపోయింది. "అయ్యో! లోపల సర్టిఫికెటు ఉండిపోయిందే" అనుకున్నది. కళ్ళలో నీళ్ళు తిరిగాయి,

వరాలు ఏడుస్తూ "నా టిక్కెట్టు, లాట్రీ టిక్కెట్టు, లోపల పెద్దబాల శిక్షలో పెట్టాను" అంటున్నది.

గురువులు పక్కనే నిలబడివుండి "ఇంకేం లాట్రీ? మతిసిపో........అంతా మసి...బూడిద...." అన్నాడు.

గంటలు మోగించుకుంటూ నీళ్ళ కార్లొచ్చాయి. అందులోనుంచి కొందరు దిగాయి. అవీ యివీ కాస్సేపు హడావిడిగా సర్దుకున్నారు. ఉన్ననీళ్ళు చిమ్మారు. చాలలేదు. కాలవలో వున్న కాసినినీళ్ళూ వాడుకుందామంటే అటువెళ్ళే వీలులేదు. కాలవపక్కన అంతా మంటలతో కంచెవేసినట్టుగా ఉంది. అటువైపు నీళ్ళులేనికాలవలో జనం కంగారుగా పరుగెత్తుతున్నారు. తమ పాత గుడ్డలూ, సులకమంచాలూ, కుండలూ, చిప్పలూ, అగ్నిబారిపడకుండా రక్షించుకుని కొందరు కాలవలో కూర్చున్నారు.

సావిత్రి యింతసేపూ కదలలేదు. మెదలలేదు. ప్రాణం లేనికర్రబొమ్మలా నిలబడిపోయింది. కళ్ళార్పకుండా ఎదురుగా జరుగుతున్న ఘోరం అంతా చూస్తున్నది.

అంతసేపూ మంటలతో ఎర్రబడిన ఆకాశం మళ్ళీ నల్లబడింది. ఇంక కాల్చేందుకు దగ్గర్లో ఏదీ లేక అగ్నిదేవుడు శాంతించాడు. కాలిన కర్రలూ, తాటాకులూ మసీ, బూడిదా, రెండు మూడు కాలిపోయిన కుక్కలూ, జంగమ శవాల్లాంటి మనుషులూ, వారి కాంతి లేని కళ్లూ, మూటలూ, ముసలమ్మలూ, పిల్లలూ, వారి ఏడుపులూ — అంతా గొడవ గొడవగా నరకంలా వుంది.

సావిత్రి కాళ్ళీడ్చుకుంటూ ఇవతలికి వచ్చి నడక సాగించి. సినిమా హాలు పక్కనే మరో సినిమాహాలు. ఇవతల జూదాలూ, డ్యాన్సులూ...లైట్లు....వెలుతురు,

అయిదారు నిముషాలసేపు ఏమీతోచని దానిలా పిచ్చెత్తినదానిలా తిరిగింది సావిత్రి తిరుగుతూ మాటిమాటికీ "లాభంలేదు. వెళ్ళిపోదాం" అనుకున్నది. "వెళ్ళిపోయి ఏ రైలుకిందనైనా పడటమా? లేకపోతే ఎక్కడన్నా దూకి చావడమా?" అనుకున్నది. మళ్ళీ అంతలోనే నవ్వుకుని "నీళ్ళెక్కడున్నాయిదూకి చచ్చేందుకు?" అనుకున్నది. తర్వాత మళ్ళీ నడవటం సాగించింది.

వంతెనకింద బడ్డీకొట్టు బయట చెక్కబల్లమీద కూర్చుని వున్నాడు గురువులు. బడ్డీకొట్లో లయిటుందిగాని కరెంటు కొరత మూలంగా లైటు వెయ్యకూడదని రూలుండటం మూలాన ఆకొట్టు యజమాని రెండు కొవ్వొత్తులు వెలిగించి పెట్టుకుని కూర్చుని వున్నాడు. చుట్టుపక్కల ఇంకెవరూ లేరు. పనికిమాలిన కోయిల ఒకటి సందర్భశుద్ధి లేకుండా ఎక్కడో దాక్కుని నీరసంగా కూస్తున్నది. పక్కయిళ్ళలో ఎక్కడనుంచో రేడియోలో కాబోలు "నాదు జన్మభూమికన్న నాకమెక్కడుందీ? సురలోకమెక్కడుందీ?" అని దేశ వైభవాన్ని గానంచేస్తున్నారెవరో.

సావిత్రి గురువులు పక్కన నిలబడింది. గురువులు ఆమెను చూసి "నువ్వా? ఇంతసేపూ ఎక్కడికెళ్ళావ్?" అని అడిగాడు.

'ఎక్కడికీ పోలేదు. అది సరేగాని పొద్దుటినుంచీ టీ నీళ్ళయినా తాగలేదు. నీరసంతో చచ్చిపోతున్నాను. ఒక పావలా ఉంటే ఇయ్యి. టీ తాగొచ్చి ఎటన్నా పోదాం .... పడుకుంటాను.'

గురువులు ముందు "అయ్యో! పాపం" అన్నాడు. తర్వాత 'నాకాడ అస్సలు డబ్బుల్లేవే.... ఎట్టా?.... అన్నాడు.

సావిత్రి నెమ్మదిగా కదిలి నడవటం మొదలు పెట్టింది. కొద్ది దూరంలో వంతెన....వంతెనమీద చీకటి....

గురువులు లేచాడు. దూరంగా నడిచిపోతున్న సావిత్రిని చూశాడు. చేతివ్రేళ్ళు విరుచుకున్నాడు. నిజానికి అతని బనీను జేబులో పావలా డబ్బులున్నాయి కాని, మరి కాస్సేపట్లో అతడు బ్రాకెట్ కట్టవలసి ఉంది. ఇవాళ అతడు అనుకున్న నెంబర్లు ఖచ్చితంగా దిగి తీరుతాయి. అంత గట్టి నమ్మకం ఉంది మరి.

ఇప్పుడతని మనసంతా చెడిపోయింది ఉన్నట్టుండి "సర్లే" అనుకుని గబగబ నడిచి "ఇదిగో నిన్నే" అని పిలిచాడు.

సావిత్రి ఆగి వెనుదిరిగి చూసింది. గురువులు ఆమె దగ్గరికి నడిచి వచ్చి "ఇదుగో .... పావలా ఉందిలే .... తీసుకో.... టీ తాగు...." అని పావలా తీసి ఆమె చేతికిచ్చాడు. సావిత్రి అది తీసుకుని నవ్వింది.

గురువులు తల వూపి "ఎదవ బ్రాకెటు తర్వాత కట్టుకో లేక పోతానా? రాతపోద్దా? నువ్వు మళ్ళీ రావొద్దులే ఎల్లిపో. నాకాడ ఓపిక లేదియ్యాళ." అంటూ వెనుదిరిగి త్వరత్వరగా నడిచిపోయాడు.

సావిత్రి వంతెన మీద ఓపిక చేసుకుని త్వరత్వరగా నడిచింది. అవతల చాలా దూరం కరెంటు కోత మూలంగా లైట్లు లేక చీకటిగా వుంది. దూరంగా ఎక్కడో వీధిమలుపులో ఒక ఒంటరి టీ దుకాణం.. అందులో హరికేన్‌లాంతరు ప్రసరిస్తున్న వెలుతురు.... అక్కడ చెక్కబల్లమీద కూలబడి కొంగుతో విసురుకుంటూ దుకాణంవాడితో "మంచి టీ చేసియ్యి...." అన్నది.

అంతలో మబ్బులేని పిడుగుపడ్డట్టయింది. సావిత్రి గుండెలు గుబ గుబలాడాయి. మెల్లో గొలుసు సవరించుకుంటూ వచ్చాడక్కడికి అప్పారావు. ఆమెను అక్కడ చూసి కాస్త ఆశ్చర్యపోయి "అరె! నువ్వా? నీ యిల్లుకూడా కాలిపోయిందా?" అని అడిగాడు.

సావిత్రి తల వూపింది.

అతడు నవ్వి 'పోతే పోనీ .. అది నీ సొంత యిల్లేం కాదుగా? ఊఁ సరే. నాతో వొచ్చెయ్ ఈ పూటకి .. ఇంటికాడ ఎవళ్ళూ లేరు. ఒంటరోణ్ణయిపోయాను.." అని టీదుకాణం వాడితో "నాక్కూడా మంచి టీ కలపవయ్యో" అంటూ కూర్చున్నాడు.

సావిత్రి టీ అందుకుంటూ నీరసంగా నవ్వింది. భయం భయంగానూ నవ్వింది. అయినా తప్పదు. ఆమె కళ్ళముందు నల్లని మచ్చలు ఇంకా తిరుగుతూనే వున్నాయి. గుండెల్లో కర్ఫ్యూ రోజులనాటి పదిరూపాయలబాకీ భయంకరంగా గంటలు కొడుతున్నది. ఈ రాత్రికిక తప్పదు. వడ్డీక్రింద తన ఆయువు తరిగిపోవడమూ తప్పదు.

వంతెనక్రింద ఆ చిన్న దీపం మినహాయిస్తే అంతా చీకటి....కాటుకలాంటి చీకటి....తన ఆకలిలాంటి చీకటి....తనకు పాపపు బ్రతుకిచ్చిన దేవుడు పైనుంచి వసూలు చేస్తున్న వడ్డీలాంటి చీకటి. ★